ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
శుక్రవారం, 04 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 21 | పేజీలు: 4 వెల: 5

## కాంగ్రెస్‌లోనే ఉంటారా..?



- బీజేపీలోకి వెళ్తే ఇముడుతారా..?!
- పొలిటికల్ క్రాస్‌రోడ్‌లో కొండా కపుల్స్
- సంధికాలంలో నిర్ణయం సందిగ్ధమే..!
- బీజేపీ ఎంపీ అరవింద్ నుంచి ఇప్పటికే పార్టీలోకి ఆహ్వానం
- బండి సంజయ్, ఈటల నుంచి కూడా సానుకూల సంకేతాలు
- బీజేపీ బీసీ నినాదానికి కొండా దంపతుల చేరిక ఊతమిస్తుందన్న అంచనా
- స్వతంత్ర భావజాలంతో ఉన్న దంపతులకు ఆ పార్టీ సరిపోతుందా?
- సైద్ధాంతిక, అధిష్ఠాన ఆలోచనలతో కాషాయం పార్టీలో ఇమడగలరా?
- జనసేన వైపు వెళ్లాలన్న శ్రేణుల్లోని ఓ వర్గం సూచన
- బీఆర్ఎస్‌తో గత విభేదాల నేపథ్యంలో ఆ పార్టీ నుంచి పిలుపు కష్టమే
- మొత్తంగా ఆప్షన్లు తక్కువ.. కన్ఫ్యూజన్ ఎక్కువ

3

## మీసం మెలేసిన కొండా మురళి

మంత్రి కొండా సురేఖ బర్తరఫ్ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఆమె నివాసానికి మీడియా ప్రతినిధులు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె భర్త కొండా మురళి మీడియా ప్రతినిధుల వైపు చూస్తూ మీసం మెలేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, తాము భయపడేది లేదనే సంకేతాన్ని ఆయన తన హావభావాల ద్వారా ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో కొండా మురళి మీసం మెలేయడం ప్రస్తుతం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.
- కాకతీయ, హైదరాబాద్



# కొండా సురేఖపై బర్తరఫ్ వేటు!

### మంత్రి పదవికి రాజీనామాకు సురేఖ విముఖత?

- బర్తరఫ్ చేయాలంటూ గవర్నర్‌కు సీఎం రేవంత్ లేఖ
- సురేఖ కుమార్తె వ్యాఖ్యలపై బాధ్యత వహించలేదంటూ అధిష్ఠానం ఆగ్రహం
- పీసీసీ క్రమశిక్షణ కమిటీ సిఫారసుతో కఠిన చర్య
- షోకాజ్ నోటీసుల నుంచి హస్తిన మంతనాల వరకు అంతా హైడ్రామా
- సురేఖపై వేటు వేయాల్సిందేనంటూ సీఎం పట్టు..?!
- పంతం నెగ్గించుకున్న రేవంత్‌రెడ్డి
- బీసీ మహిళనైన తనపై కక్ష సాధింపేనని సురేఖ ఆరోపణ

2

తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో కొద్దిరోజులుగా కొనసాగుతున్న కొండా సురేఖ ఎపిసోడ్‌కు బర్తరఫ్ వేటుతో ఎండ్ కార్డు పడింది. మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఆమె మంత్రి పదవికి రాజీనామా చేయడానికి నిరాకరించడంతో.. బర్తరఫ్ చేయాలంటూ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సీఎం సిఫారసు లేఖ పంపారు. దీంతో సురేఖను కేబినెట్ నుంచి తొలగించే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొండా సురేఖ కుమార్తె సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదం.. సురేఖకు షోకాజ్ నోటీసులు, పీసీసీ క్రమశిక్షణ కమిటీ విచారణ, అధిష్ఠానం మంతనాలు, రాజీనామా డిమాండ్.. చివరకు బర్తరఫ్ సిఫారసు వరకు చేరింది. మరోవైపు తన కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదంటూ సురేఖ తన వాదనను చివరి వరకు కొనసాగించారు. - కాకతీయ, తెలంగాణ బ్యూరో





## సీఎం బ్లాక్ మెయిల్ చేశారు

- బర్తరఫ్‌పై పశ్చాత్తాపం లేదు
- తప్పు చేయనప్పుడు బాధపడాల్సిన అవసరం లేదు
- ముందు నన్ను ప్రశ్నించాలి.. రాజీనామా కోరాలి
- నేరుగా గవర్నర్‌కు ఎలా పంపిస్తారు?
- వంద మంది మాట్లాడుతుంటే.. నన్నే ఎందుకు టార్గెట్ చేశారు?
- నా కూతురు వ్యాఖ్యలకు నన్నెందుకు బాధ్యురాలిని చేస్తారు?
- బీసీ మహిళను ఇలా అవమానించడం సరికాదు
- కాంగ్రెస్ నుంచి బయటకు వెళ్లే ఆలోచన లేదు
- సోనియా, రాహుల్, ప్రియాంకలపై గౌరవంతోనే కొనసాగుతున్నా
- వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మాజీమంత్రి సురేఖ సంచలన వ్యాఖ్యలు

"నా కూతురు కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలకు నన్నెందుకు బాధ్యురాలిని చేస్తున్నారు? ఆమె స్వతంత్రంగా ఉన్న మహిళ. ఆమె ఆలోచనలు, ఆమె నిర్ణయాలు ఆమెవి. వాటికి నేను ఎలా బాధ్యురాలిని అవుతాను? నేను ఎలాంటి తప్పూ చేయలేదు. తప్పు చేయనప్పుడు పశ్చాత్తాపపడాల్సిన అవసరం నాకు లేదు" అని మాజీ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. తనపై తీసుకున్న చర్య వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు.
- కాకతీయ, తెలంగాణ బ్యూరో

2

## నేను రేవంత్‌రెడ్డిని శపిస్తున్నా

- మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు
- నా తల్లికి అన్యాయం జరిగింది..
- ఆమెను తొలగించిన తీరు తీవ్రంగా బాధించింది
- దమ్ముంటే పరకాల నుంచి రేవంత్‌రెడ్డి పోటీ చేయాలి
- నేను సవాల్ విసురుతున్నా
- మంత్రి వర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్‌పై సుస్మిత ఆగ్రహం

3



## ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ


- ఎన్నికలప్పుడే రాజకీయాలు.. తర్వాత అభివృద్ధే
- వచ్చే ఎన్నికల్లోగా చాంద్రాయణగుట్టకు మెట్రో
- మీరాలం చెరువులో 3 కి.మీ. కేబుల్ బ్రిడ్జి
- అసదుద్దీన్ అడిగిన అభివృద్ధి పనులు మంజూరు చేయాలి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ఎన్నికలప్పుడే రాజకీయాలని, ఎన్నికలు ముగిసిన తర్వాత అభివృద్ధి ఒక్కటే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలు కలిసి కట్టుగా నడిస్తేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. హైదరాబాద్ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోందన్నారు. చంచల్‌గూడ-సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గురువారం సీఎం మాట్లాడారు. గత ప్రభుత్వం కేవలం

........(తరువాయి 3లో)

## రైతన్నల కోసం పాదయాత్ర చేస్తా

- 14లోపు సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించాలి
- లేకుంటే వేలాది మంది రైతులతో కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర
- కేసీఆర్ 2003లో చేసిన పోరాట స్ఫూర్తితో మరో ఉద్యమానికి సిద్ధం
- రైతుల సమస్యలపై అసెంబ్లీలో నిలదీస్తాం
- ప్రజాక్షేత్రంలో పోరాటం ఉధృతం చేస్తాం
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2

## ఇదేం అన్యాయం!?

- కుడా చైర్‌పర్సన్‌గా సుధారాణి నియామకంపై కాంగ్రెస్‌లో అసంతృప్తి
- పార్టీ అధికారంలోకి వచ్చాక చేరిన నాయకురాలికి అందలం
- ఏళ్లుగా కష్టపడిన నేతలకు,నాయకురాళ్లకు దక్కని పదవులు
- పాత టీడీపీ నేతలకే నామినేటెడ్ పదవులు దక్కుతున్నాయంటూ విమర్శలు
- పద్మశాలి సామాజిక వర్గం నుంచి లీడర్లే లేరా..?!
- పార్టీకి ఏం సేవ చేశారని, ఏం తొందర వచ్చిందని ఆమెకు ఇచ్చారంటూ అసంతృప్తి
- కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి జ్వాలలను రగులుస్తున్న కుడా చైర్‌పర్సన్ నియామకం



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి నియామకం కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి జ్వాలలు రగిలిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్‌లో చేరిన నాయకురాలికి కీలకమైన నామినేటెడ్ పదవి కట్టబెట్టడంపై పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పని చేసిన నేతలను పక్కనపెట్టి, ఎన్నికల సమయంలోనో.. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనో వచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. సుధారాణి నియామకం వెనుక సామాజిక సమీకరణాలున్నాయన్న ప్రచారం జరుగుతున్నప్పటికీ.. పార్టీ కోసం కష్టపడిన తమకు మాత్రం ఎందుకు గుర్తింపు దక్కడం లేదని పలువురు

........(తరువాయి 2లో)

## చిన్నారెడ్డిపై వేటు..

- ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ పదవి నుంచి తొలగింపు
- ఆయన స్థానంలో జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మికి అవకాశం
- వనపర్తి టికెట్ వ్యవహారంతో మొదలైన విభేదాలు
- క్రమశిక్షణ ఉల్లంఘన, వర్గపోరుపై అధిష్ఠానం సీరియస్



2

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

- రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను వేగవంతం చేయాలి
- పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి
- లైసెన్స్‌డ్ సర్వేయర్లు విధులకు హాజరుకాకపోతే చర్యలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

3



# కొండా సురేఖపై బర్తరఫ్ వేటు!

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో కొద్దిరోజులుగా కొనసాగుతున్న కొండా సురేఖ ఎపిసోడ్‌కు బర్తరఫ్ వేటుతో ఎండ్ కార్డు పడింది. మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఆమె మంత్రి పదవికి రాజీనామా చేయడానికి నిరాకరించడంతో.. బర్తరఫ్ చేయాలంటూ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సీఎం సిఫారసు లేఖ పంపారు. దీంతో సురేఖను కేబినెట్ నుంచి తొలగించే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొండా సురేఖ కుమార్తె సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదం.. సురేఖకు షోకాజ్ నోటీసులు, పీసీసీ క్రమశిక్షణ కమిటీ విచారణ, అధిష్ఠానం మంతనాలు, రాజీనామా డిమాండ్.. చివరకు బర్తరఫ్ సిఫారసు వరకు చేరింది. మరోవైపు తన కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదంటూ సురేఖ తన వాదనను చివరి వరకు కొనసాగించారు.

**మంత్రి పదవికి రాజీనామాకు సురేఖ విముఖత?**

మంత్రి పదవికి రాజీనామా చేయాలని తనను ఎవరూ ముందుగా కోరలేదని కొండా సురేఖ స్పష్టం చేశారు. తనను ప్రశ్నించకుండా, తన వివరణ పూర్తిగా తీసుకోకుండా నేరుగా గవర్నర్‌కు బర్తరఫ్ సిఫారసు లేఖ పంపడం సరికాదని ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసినప్పుడు కూడా తన వాదనను ఆయన విన్నారని, 'చూస్తాం' అని మాత్రమే చెప్పారని.. రాజీనామా చేయాలని కానీ, చేయకపోతే చర్యలు ఉంటాయని కానీ తనకు ఎలాంటి సూచన ఇవ్వలేదని సురేఖ తెలిపారు. తాను మంత్రిగా కొనసాగాలని అధిష్ఠానాన్ని కోరానని, అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నానని, ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఉన్నానని వివరించారు. ఈ నేపథ్యంలో తనను నేరుగా తొలగించే నిర్ణయం తనకు షాక్ కలిగించిందని ఆమె పేర్కొన్నారు.

**బర్తరఫ్ చేయాలంటూ గవర్నర్‌కు సీఎం రేవంత్ లేఖ**

సురేఖ రాజీనామాకు అంగీకరించకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేరుగా గవర్నర్‌కు సిఫారసు లేఖ పంపారు. మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని ఆ లేఖలో కోరారు. ముఖ్యమంత్రి సిఫారసుతో ఈ వ్యవహారం పార్టీలోని అంతర్గత చర్చల స్థాయి దాటి రాజ్యాంగబద్ధ ప్రక్రియకు చేరింది. ఈ నిర్ణయాన్ని కొండా సురేఖ తీవ్రంగా తప్పుబట్టారు. ''ముందుగా నా ఒపీనియన్ తీసుకోవాలి.. నన్ను రాజీనామా చేయమని అడగాలి. ఆ తర్వాతే వాళ్లు రియాక్ట్ అవ్వాలి. అది జరగలేదు'' అని ఆమె పేర్కొన్నారు. గవర్నర్‌కు పంపిన లేఖ విషయంలోనూ ఆమె పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తనకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే నేరుగా ఈ నిర్ణయం తీసుకోవడం సరికాదని అన్నారు.

**కుమార్తె వ్యాఖ్యలపై బాధ్యత లేదా..?!**

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికే మళ్లీ టికెట్ ఇస్తానంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై కొండా సుస్మిత తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రితోపాటు కాంగ్రెస్ నేతలపై ఆమె చేసిన వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర కలకలం రేపాయి. సుస్మిత కాంగ్రెస్ పార్టీ సభ్యురాలు కాదని, వివాహం అనంతరం స్వతంత్రంగా జీవిస్తున్నారని కొండా సురేఖ చెప్పారు. ఆమె ఆలోచనలు, నిర్ణయాలు ఆమెవేనని, తన కుమార్తె వ్యాఖ్యలకు తాను బాధ్యురాలిని కాదని స్పష్టం చేశారు. అంతేకాక.. ఆమె వ్యాఖ్యలపై తాను పశ్చాత్తాపపడడం లేదని, తాను తప్పు చేయనప్పుడు పశ్చాత్తాపపడాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. అయితే మంత్రిగా ఉన్న సురేఖ ముఖ్యమంత్రిపై తన కుమార్తె చేసిన తీవ్ర వ్యాఖ్యలను బహిరంగంగా ఖండించకపోవడాన్ని పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిగణించినట్లు సురేఖ స్వయంగా వివరించారు.

**పీసీసీ క్రమశిక్షణ కమిటీ సిఫారసుతో కఠిన చర్య**

సుస్మిత వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని పీసీసీ క్రమశిక్షణ కమిటీ కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కమిటీ చైర్మన్ మల్లు రవికి ఆమె తన వివరణ అందించారు. తన కుమార్తె వ్యాఖ్యలకు తనకు సంబంధం లేదని, ఆమె స్వతంత్ర మహిళ అని వివరించారు. తనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని, మంత్రిగా తాను సమర్థంగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. అయితే ఈ వివరణతో క్రమశిక్షణ కమిటీ సంతృప్తి చెందలేదు. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా పరిణామాలు చోటుచేసుకున్నాయని భావించి సురేఖపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. ఈ నివేదికే తదుపరి అధిష్ఠానం స్థాయిలో చర్చకు వచ్చింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వ్యవహారాలపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయంతో సురేఖపై చర్యలకు మార్గం సుగమమైంది.

**అంతా హైడ్రామా**

పీసీసీ నివేదికతో వ్యవహారం ఢిల్లీకి చేరడంతో కాంగ్రెస్‌లో రాజకీయ ఉత్కంఠ పెరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధిష్ఠానం పెద్దలతో చర్చలు జరిపారు. మరోవైపు కొండా సురేఖ కూడా ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. తన కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని, తన వాదనను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, కేసీ వేణుగోపాల్‌కు రాతపూర్వకంగా తన వివరణ ఇచ్చానని చెప్పారు. అధిష్ఠానం తన మాట విన్నప్పటికీ ఎలాంటి తుది నిర్ణయాన్ని తనకు ముందుగా చెప్పలేదని సురేఖ పేర్కొన్నారు. దీంతో ఒకవైపు సీఎం వర్గం, మరోవైపు సురేఖ వాదనల మధ్య హస్తినలో జరిగిన మంతనాలు రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీశాయి.

**సురేఖపై వేటు వేయాల్సిందేనంటూ సీఎం పట్టు..?!**

సురేఖను కొనసాగించే విషయంలో వెనక్కి తగ్గకుండా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి పట్టుబట్టినట్లు పరిణామాలు స్పష్టం చేశాయి. ముఖ్యమంత్రిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సందర్భంలో మంత్రిగా ఉన్న సురేఖ కనీసం వాటిని ఖండించకపోవడం పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని సీఎం వర్గం భావించినట్లు తెలుస్తోంది. మరోవైపు సురేఖ మాత్రం తన కుమార్తె స్వతంత్ర మహిళ అని, ఆమె చేసిన వ్యాఖ్యలకు తాను బాధ్యురాలిని కాదని చెబుతూ వచ్చారు. ఈ విషయంలో తన వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని ఆమె స్పష్టం చేశారు. రాజీనామాకు అంగీకరిస్తే వ్యవహారం అక్కడితో ముగిసే అవకాశం ఉన్నప్పటికీ.. సురేఖ అందుకు ససేమిరా అనడంతో చివరకు ముఖ్యమంత్రి బర్తరఫ్ సిఫారసు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**పంతం నెగ్గించుకున్న రేవంత్‌రెడ్డి**

కొండా సురేఖ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుకున్నదే జరిగిందనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో మొదలైంది. పార్టీ క్రమశిక్షణ విషయంలో వెనక్కి తగ్గకుండా అధిష్ఠానం ముందుకు వెళ్లడం, సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో నేరుగా గవర్నర్‌కు బర్తరఫ్ సిఫారసు చేయడం ద్వారా సీఎం తన నిర్ణయంలో దృఢత్వాన్ని ప్రదర్శించారు. ముఖ్యమంత్రిపై బహిరంగ విమర్శలు, పార్టీ నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేసే పరిస్థితులకు అడ్డుకట్ట వేయాలన్న సంకేతాన్ని కూడా ఈ చర్య ద్వారా ఇచ్చినట్లయింది. సురేఖను తప్పించాలని పీసీసీ క్రమశిక్షణ కమిటీ చేసిన సిఫారసు, ఢిల్లీలో అధిష్ఠానం స్థాయిలో జరిగిన చర్చలు, రాజీనామాకు ఆమె నిరాకరణ.. అన్నీ కలిసి చివరకు సీఎం నిర్ణయానికి బలం చేకూర్చాయి.

**బీసీ మహిళనైన తనపై కక్ష సాధింపేనని సురేఖ ఆరోపణ**

తనపై తీసుకున్న చర్యను కొండా సురేఖ రాజకీయ కక్ష సాధింపుగానే అభివర్ణించారు. తాను ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సీనియర్ బీసీ మహిళనని, రెండోసారి మంత్రిగా కొనసాగుతున్నానని గుర్తుచేశారు. ''బీసీలకు ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయమా?'' అని ప్రశ్నించారు. పార్టీలో ఇతర నేతలు, మంత్రులపై కూడా వివిధ ఆరోపణలు వచ్చిన సందర్భాల్లో ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని నిలదీశారు. తనకు వ్యతిరేకంగా కొందరు నేతలు చాలాకాలంగా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను తనపై చర్య తీసుకోవడానికి ఒక ఆయుధంగా ఉపయోగించుకున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డిని ఒకప్పుడు తాను ఎంతో అభిమానించానని, ఆయన పీసీసీ అధ్యక్షుడిగా రావాలని కోరుకున్నానని గుర్తుచేసిన సురేఖ.. అలాంటి తనపై ఇప్పుడు ఈ విధంగా చర్య తీసుకోవడం బాధ కలిగించిందన్నారు. అయినప్పటికీ సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీపై ఉన్న గౌరవంతో కాంగ్రెస్‌ను వెంటనే వీడే ఆలోచన లేదని స్పష్టం చేశారు. భర్త కొండా మురళి, కుటుంబ సభ్యులతో చర్చించిన అనంతరం తదుపరి కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు.

# రైతన్నల కోసం పాదయాత్ర చేస్తా

**కాకతీయ, మిర్యాలగూడ :** రైతన్నల పంటలను కాపాడేందుకు మరోసారి పోరాటానికి సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. సెప్టెంబర్ 14లోపు ఎడమ కాలువకు నీటిని ఎప్పుడు, ఎంత మేరకు విడుదల చేస్తారో స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలని ప్రభుత్వానికి గడువు విధించారు. ఆలోపు ప్రభుత్వం స్పందించకపోతే వేలాది మంది రైతులతో కలిసి కోదాడ నుంచి హాలియా వరకు తానే స్వయంగా పాదయాత్ర చేస్తానని కేటీఆర్ స్పష్టం చేశారు. మిర్యాలగూడ రైతు మహాధర్నాలో ఆయన మాట్లాడారు. సాగర్‌లో ప్రస్తుతం 180 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ఎడమ కాలువ కింద ఉన్న రైతులకు చుక్క నీరు ఇవ్వకపోవడం దారుణమని కేటీఆర్ అన్నారు. నీళ్లు లేకపోవడం వల్ల సమస్య ఏర్పడలేదని, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ఈ సీజన్‌లో ఎడమ కాలువకు నీటిని విడుదల చేసే అవకాశం పూర్తిగా ఉన్నప్పటికీ ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. పంటలు ఎండిపోతున్న సమయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. మిర్యాలగూడతో పాటు హుజూర్‌నగర్, నాగార్జునసాగర్, కోదాడ, సూర్యాపేట, నల్లగొండ, నకిరేకల్ ప్రాంతాల్లో సాగర్ ఎడమ కాలువ కింద ఉన్న రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉందన్నారు. కేసీఆర్ పాలనలో ధీమాగా వ్యవసాయం చేసిన రైతులు ప్రస్తుతం పంటలు ఎండిపోతుంటే నీళ్లు వస్తాయో రావో తెలియని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కళ్ల ముందే పంటలు ఎండిపోతున్నా సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

**తెలంగాణను అన్నపూర్ణగా మార్చిన కేసీఆర్ పాలన**

కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ వ్యవసాయ రంగం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ అన్నపూర్ణగా, ధాన్య భాండాగారంగా మారిందని తెలిపారు. ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లా వరి ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిచిందని, తెలంగాణ రైస్‌బౌల్‌గా పేరుగాంచిన మిర్యాలగూడ పచ్చని మాగాణాలతో కళకళలాడిందని గుర్తుచేశారు. అయితే ఇప్పుడు అదే ప్రాంతంలో రైతులు తమ పంటలకు నీళ్లు కావాలని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. రూ.2 లక్షల రుణమాఫీ, రైతులకు పెరిగిన ఆర్థిక సాయం, కౌలు రైతులకు మద్దతు, పంటలకు బోనస్ వంటి హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు వాటిని విస్మరించిందని ఆరోపించారు. అడ్డగోలుగా హామీలు ఇచ్చి రైతులను మభ్యపెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లు వేసిన రైతులు ఇప్పుడు తాము మోసపోయామని భావించే పరిస్థితి వచ్చిందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**సెప్టెంబర్ 14లోపు షెడ్యూల్ ఇవ్వాలి**

ఎడమ కాలువకు నీటి విడుదల విషయంలో ప్రభుత్వం రైతులను అనిశ్చితిలో ఉంచకుండా స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. "సెప్టెంబర్ 14లోపు ఎడమ కాలువకు నీటిని ఎప్పుడు విడుదల చేస్తారు? ఎన్ని తడులకు నీళ్లు ఇస్తారు? ఎంత మేరకు నీరు అందిస్తారు? అనే విషయాలపై స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలి" అని ప్రభుత్వాన్ని కోరారు. నిర్ణీత గడువులోగా ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో సాగర్ ఆయకట్టు రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు, నీటిపారుదల శాఖ రైతుల ఆవేదనను అర్థం చేసుకుని వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. పంటలను కాపాడేందుకు తక్షణమే నీటిని విడుదల చేయాలని కోరారు.

**2003 నాటి పోరాట స్ఫూర్తితో పాదయాత్ర**

సాగర్ ఎడమ కాలువ రైతుల సమస్య కోసం 2003లో కేసీఆర్ చేపట్టిన కోదాడహాలియా పాదయాత్రను కేటీఆర్ గుర్తుచేశారు. అప్పట్లో రైతుల సాగునీటి సమస్యపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి నీటిని విడుదల చేయించడంలో కేసీఆర్ విజయం సాధించారని చెప్పారు. అదే పోరాట స్ఫూర్తితో ఇప్పుడు మరోసారి రైతుల కోసం పాదయాత్రకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. "సెప్టెంబర్ 14లోపు ఎడమ కాలువకు నీటి విడుదలపై స్పష్టమైన షెడ్యూల్ ఇవ్వాలి. లేకుంటే వేలాది మంది రైతులతో కలిసి కోదాడ నుంచి హాలియా వరకు నేనే స్వయంగా పాదయాత్ర చేస్తా" అని కేటీఆర్ తేల్చిచెప్పారు. రైతుల కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే కేసీఆర్ స్ఫూర్తితో రైతన్నలతో కలిసి వారి హక్కుల కోసం ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

**అసెంబ్లీలో నిలదీస్తాం.. ప్రజాక్షేత్రంలో ఉద్యమం ఉధృతం**

రైతులకు అండగా కేసీఆర్ ఉన్నారని, బీఆర్ఎస్ పార్టీ మొత్తం రైతాంగం పక్షాన నిలుస్తుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. రైతుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. అక్కడ కూడా సరైన సమాధానం రాకపోతే ప్రజాక్షేత్రంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. "నీళ్లు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి. రైతుల పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. ప్రభుత్వం స్పందించకపోతే కేసీఆర్ పోరాట స్ఫూర్తితో రైతన్నలతో కలిసి పాదయాత్ర చేసి వారి హక్కుల కోసం పోరాడతాం" అని కేటీఆర్ తేల్చిచెప్పారు.



# చిన్నారెడ్డిపై వేటు..



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికే మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన కాంగ్రెస్ అధిష్ఠానం.. తాజాగా సీనియర్ నేత, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డిపై కూడా చర్యలు తీసుకుంది. ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ పదవి నుంచి చిన్నారెడ్డిని తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వనపర్తికి చెందిన చిన్నారెడ్డి ఎపిసోడ్‌లో కొంతకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నుంచి మేఘారెడ్డి కాంగ్రెస్‌లో చేరిన తర్వాత చిన్నారెడ్డితో విభేదాలు మొదలయ్యాయి. తొలుత చిన్నారెడ్డికి ప్రకటించిన వనపర్తి టికెట్‌ను ఆ తర్వాత మేఘారెడ్డికి కేటాయించడం ఇరువురు నేతల మధ్య దూరాన్ని పెంచింది. అప్పటి నుంచి కొనసాగుతున్న వర్గపోరు తాజాగా పార్టీ అధిష్ఠానం వరకు వెళ్లింది.

**గోపాల్‌పేట వ్యాఖ్యలతో దుమారం**

ఇటీవల గోపాల్‌పేట వేదికగా జిల్లెల చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీశాయి. వాటిపై వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి తీవ్రంగా స్పందించారు. చిన్నారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గాంధీభవన్, టీపీసీసీతోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. చిన్నారెడ్డి వ్యవహారాన్ని కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ కూడా పరిశీలించింది. క్రమశిక్షణ ఉల్లంఘన ఆరోపణలు, పార్టీలో కొనసాగుతున్న వర్గపోరు నేపథ్యంలో ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని అధిష్ఠానానికి సిఫార్సు చేసినట్లు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ పదవి నుంచి చిన్నారెడ్డిని తొలగిస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఆయన స్థానంలో గద్వాల విజయలక్ష్మిని నియమించడం ద్వారా రాష్ట్ర కాంగ్రెస్‌లో మరో కీలక మార్పు చోటుచేసుకుంది.

# ఇదేం అన్యాయం..!?

(మొదటిపేజీ తరువాయి)



ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు నుంచి జెండా మోసిన నాయకులు, కార్యకర్తలు పదవుల కోసం ఎదురుచూస్తున్నారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నియోజకవర్గాలు, జిల్లాల స్థాయిలో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ.. ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ కాంగ్రెస్‌కు అండగా నిలిచిన నాయకుల్లో చాలామందికి ఇప్పటికీ సరైన గుర్తింపు లభించలేదన్న అసంతృప్తి ఉంది. నామినేటెడ్ పదవుల భర్తీ సందర్భంగా తమను పరిగణనలోకి తీసుకుంటారని ఆశించిన వారికి నిరాశే ఎదురవుతోందని కొందరు నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా కుడా చైర్‌పర్సన్ పదవిని సుధారాణికి కేటాయించడంతో ఈ అసంతృప్తి మరింత బహిర్గతమవుతున్నట్లు సమాచారం.

**పాత టీడీపీ నేతలకే పదవులా?**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి వచ్చిన పలువురు నేతలకు ప్రాధాన్యం లభిస్తోందన్న విమర్శలు ఇప్పటికే పార్టీలో వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గతంలో తెలుగుదేశం పార్టీలో పనిచేసిన నాయకులకు నామినేటెడ్ పదవులు దక్కుతున్నాయంటూ కాంగ్రెస్‌లోని పాత నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ కోసం సంవత్సరాల తరబడి పనిచేసిన తమను పక్కనబెట్టి, రాజకీయ పరిస్థితులను బట్టి పార్టీలోకి వచ్చిన వారికి పదవులు ఇవ్వడం ఏ మేరకు సమంజసమని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. తాజాగా సుధారాణి నియామకం కూడా ఇదే కోణంలో పార్టీలో చర్చకు వస్తున్నట్లు తెలుస్తోంది. పదవి ఇవ్వడానికి ఆమెకు ఉన్న ప్రత్యేక అర్హత ఏమిటి? పార్టీ కోసం చేసిన సేవ ఏమిటి? అనే ప్రశ్నలు కొందరు నేతల నుంచి వినిపిస్తున్నట్లు సమాచారం.

**పద్మశాలి వర్గం నుంచి లీడర్లే లేరా..?!**

సుధారాణి నియామకంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కొందరు కాంగ్రెస్ నేతలు సామాజిక వర్గం అంశాన్ని కూడా ప్రస్తావిస్తున్నట్లు తెలుస్తోంది. పద్మశాలి సామాజికవర్గం నుంచి కాంగ్రెస్‌లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న నాయకులు, నాయకురాళ్లు ఉన్నప్పటికీ వారిని కాదని సుధారాణికే కీలక పదవి ఎందుకు ఇచ్చారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ జెండా పట్టుకుని పనిచేసిన వారిని గుర్తించకుండా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల క్షేత్రస్థాయి కార్యకర్తల్లో నిరుత్సాహం ఏర్పడే ప్రమాదం ఉందని పలువురు నేతలు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. పద్మశాలి వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశమే ఉంటే.. కాంగ్రెస్‌లోని సీనియర్ నాయకుల్లోనే ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది.

**అసంతృప్తి జ్వాలలు రగిలిస్తున్న నియామకం**

కుడా చైర్‌పర్సన్ పదవి భర్తీతో కాంగ్రెస్‌లో అంతర్గతంగా నెలకొన్న అసంతృప్తి మరోసారి తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులు దక్కకపోవడం, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం లభించడం కొనసాగితే భవిష్యత్‌లో పార్టీపై దాని ప్రభావం పడుతుందని కొందరు నాయకులు హెచ్చరిస్తున్నట్లు సమాచారం. సుధారాణికి పదవి ఇవ్వడంపై బహిరంగంగా మాట్లాడేందుకు వెనుకాడుతున్నప్పటికీ.. అంతర్గతంగా మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. 'పార్టీ కోసం ఏం సేవ చేశారని పదవి ఇచ్చారు? ఏం తొందర వచ్చింది?' అంటూ కొందరు నాయకులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామం వరంగల్ కాంగ్రెస్‌లో వర్గపోరుకు మరింత ఆజ్యం పోస్తుందా? అన్న చర్చ కూడా మొదలైంది. పార్టీ అధిష్ఠానం ఈ అసంతృప్తిని ఎలా చల్లారుస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# సీఎం బ్లాక్ మెయిల్ చేశారు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** ''నా కూతురు కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలకు నన్నెందుకు బాధ్యురాలిని చేస్తున్నారు? ఆమె స్వతంత్రంగా ఉన్న మహిళ. ఆమె ఆలోచనలు, ఆమె నిర్ణయాలు ఆమెవి. వాటికి నేను ఎలా బాధ్యురాలిని అవుతాను? నేను ఎలాంటి తప్పూ చేయలేదు. తప్పు చేయనప్పుడు పశ్చాత్తాపపడాల్సిన అవసరం నాకు లేదు'' అని మాజీ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. తనపై తీసుకున్న చర్య వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. ఓ టీవీ చానెల్‌తో మాట్లాడిన ఆమె తాజా రాజకీయ పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు వ్యతిరేకంగా కొంతకాలంగా పనిచేస్తున్న నేతలు సుస్మిత వ్యాఖ్యలను ఒక ఆయుధంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. తన వివరణను పార్టీ అధిష్ఠానానికి పూర్తిగా ఇచ్చినా.. తనను సంప్రదించకుండా నేరుగా మంత్రి పదవి నుంచి తొలగించే నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. తనను ముందుగా ప్రశ్నించి, వివరణ తీసుకుని, రాజీనామా చేయాలని అడగాల్సి ఉందని.. అలా కాకుండా నేరుగా గవర్నర్‌కు లేఖ పంపడం తనకు షాక్ కలిగించిందన్నారు.

**ముందు నన్ను ప్రశ్నించాలి.. ఆ తర్వాతే చర్యలుండాలి**

రూల్ ప్రకారం ముందుగా నన్ను ప్రశ్నించాలి. ఏం జరిగిందో అడగాలి. రాజీనామా చేయమని చెప్పాలి. ఇవేమీ చేయకుండా నేరుగా సీఎస్‌తో గవర్నర్‌కు పంపించారు. ఆ లేఖలో ఒక సంతకం లేదు. ఒక లెటర్‌హెడ్ లేదు. వైట్ పేపర్‌పై రాసి పంపించారు. ఇది సరైన విధానం కాదు. ముందుగా నా ఒపీనియన్ తీసుకోవాలి. నన్ను రాజీనామా చేయమని అడగాలి. ఆ తర్వాతే పార్టీ, ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోవాలన్నా తీసుకోవాలి. కానీ నాకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. నేను రాజీనామా చేస్తే మంచిదని, లేకపోతే పార్టీ నుంచి వేటు వేస్తామని ముందుగానే ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. ఈ రోజు వచ్చిన లేఖ నాకు నిజంగానే షాక్. అధిష్ఠానం నన్ను ముందుగా అడుగుతుందని నేను అనుకున్నాను. నేరుగా నిర్ణయం తీసుకోవడం కరెక్ట్ కాదనేదే నా అభిప్రాయం అని సురేఖ అన్నారు. గతంలో తనకు షోకాజ్ నోటీసు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ''షోకాజ్ నోటీసుకు నేను నా వివరణ ఇచ్చాను. నా కూతురు వ్యాఖ్యలతో నాకు సంబంధం లేదని స్పష్టంగా చెప్పాను. అధిష్ఠానానికి కూడా ఇదే విషయం వివరించాను. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసినప్పుడు కూడా నా మాట పూర్తిగా విన్నారు. 'చూస్తాం' అన్నారు. అంతే తప్ప రాజీనామా చేయాలని గానీ, వ్యాఖ్యలను ఖండించాలని గానీ, లేదంటే చర్యలు తప్పవని గానీ నాకు చెప్పలేదు'' అని తెలిపారు.

**నన్నే ఎందుకు టార్గెట్ చేశారు?**

రాజకీయాల్లో వంద మంది వంద రకాలుగా మాట్లాడుతున్నారు. మరి ఆ వంద మందిలో ఎవరినీ ముట్టుకోకుండా కొండా సురేఖనే ఎందుకు ముట్టుకోవాల్సి వచ్చింది? వాళ్లే ఆత్మపరిశీలన చేసుకోవాలి. నన్ను వంద శాతం టార్గెట్ చేశారు. నా కూతురు చేసిన వ్యాఖ్యలు వాళ్లకు ఒక ఆయుధంగా దొరికాయి. దాని కోసం ఇంతకాలంగా ఎదురు చూస్తున్న వాళ్లు ఇప్పుడు దాన్ని ఉపయోగించుకున్నారు. నా మీద కొంతమంది నేతలు ఒక ప్రణాళికతో పనిచేస్తున్నారు. ఇవాళ జరిగిన పరిణామం దానికి ఫలితమే'' అని సురేఖ ఆరోపించారు. తనపై కుట్రకు పాల్పడిన వారిలో కొంతమంది నేతల పేర్లను కూడా ప్రస్తావించారు. ''కొండాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వేం నరేందర్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు నా వ్యతిరేకంగా పనిచేశారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మా ఇన్‌చార్జిగా ఉన్నప్పటి నుంచే నా మీద పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారు. వరంగల్‌లో ఒక గ్రూపుగా పనిచేస్తున్న కొంతమంది నేతలకు ఒక వర్గంతో సంబంధాలు ఉన్నాయి. వాళ్లంతా కలిసి ఒక ప్రణాళిక ప్రకారమే ముందుకు వెళ్లారు. నా కూతురు చేసిన వ్యాఖ్యలు అందుకు అవకాశం కల్పించాయి'' అని ఆమె పేర్కొన్నారు. నా కుటుంబ సభ్యులు సుస్మితతో మాట్లాడించి వ్యాఖ్యలు చేయించారని అనుకోవడం కూడా తప్పు. ఆమెకు పెళ్లయింది. ఒక ఇంటి కోడలిగా వెళ్లింది. ఆమె ఆలోచనలు ఆమెవి. నిర్ణయాలు ఆమెవి. మేము ఆమెను ఎలా నియంత్రించగలం? ఇవాళ అందరూ రాజకీయంగా తమ పిల్లలను ముందుకు తీసుకొస్తున్నారు. ఎవరి కుటుంబంలో ఎవరు ఏం మాట్లాడుతున్నారు అనేది కూడా చూడాలని సురేఖ అన్నారు.

**సీఎం బ్లాక్‌మెయిల్ చేశారనే సమాచారముంది**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ చేశారనే సమాచారం నాకు ఉంది. 'ఆమెను తొలగించకపోతే నేను వెళ్లిపోతాను' అనే రీతిలో ఆయన అధిష్ఠానం వద్ద మాట్లాడారని నాలుగు రోజులుగా సమాచారం ఉంది. అలాంటి పరిస్థితుల్లోనే అధిష్ఠానం ఈ నిర్ణయానికి వచ్చిందని నేను భావిస్తున్నాను. అయితే హైకమాండ్ మొదటి నుంచే నన్ను తొలగించాలని అనుకున్నదని నేను అనుకోవడం లేదు. నేను సీనియర్ బీసీ మహిళను. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచాను. రెండోసారి మంత్రిగా పనిచేశాను. ఇలాంటి నేపథ్యం ఉన్న నన్ను ఈ విధంగా వ్యవహరించడం బాధ కలిగిస్తోంది'' అని సురేఖ అన్నారు. రేవంత్‌రెడ్డిపై తనకున్న గత అభిమానం గురించి కూడా ఆమె ప్రస్తావించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత నేను అంతగా అభిమానించిన నాయకుడు రేవంత్‌రెడ్డే. ఆయన పీసీసీ అధ్యక్షుడు కావాలని నేను కోరుకున్నాను. ఆకాంక్షించాను. అలాంటి వ్యక్తే ఈ రోజు నన్ను మంత్రి పదవి నుంచి తొలగించే పరిస్థితి రావడం బాధ కలిగిస్తోంది. రాజకీయాల్లో ఎన్నో పరిణామాలు జరుగుతాయి. కానీ నేను అనుభవిస్తున్న పరిస్థితి మాత్రం నన్ను ఆవేదనకు గురిచేస్తోందని అన్నారు.

**బీసీ మహిళను అవమానించడం సరికాదు**

ఇలాంటివి కాంగ్రెస్ పార్టీలో చాలా జరుగుతున్నాయి. కానీ నా విషయంలోనే ఎందుకు ఇలా వ్యవహరించారు? ఒక బీసీ మహిళను అవమానించడం సరికాదు. నేను ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచాను. రెండోసారి మంత్రిగా ఉన్నాను. రాష్ట్రంలో ఎమ్మెల్యేగా ఉన్న బీసీ మహిళల్లో నేను ముందున్నాను. రేపు ఒక బీసీ మహిళను ముఖ్యమంత్రిని చేయాలనే ఆలోచన వస్తే.. ఆ అవకాశానికి మొదటి అర్హత ఉన్నవారిలో కొండా సురేఖ ఉంటుంది. అలాంటి నన్ను ఈ రోజు ఇలా అవమానించడం బాధాకరమని ఆమె అన్నారు. బీసీలకు ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయమా? నా విషయంలో ఒక విధంగా, ఇతరుల విషయంలో మరో విధంగా ఎందుకు వ్యవహరిస్తున్నారు? ప్రభుత్వంలో ఉన్న పలువురు మంత్రులు, నేతలపై కూడా ఆరోపణలు ఉన్నాయి. వాళ్ల విషయంలో ఏం చర్యలు తీసుకున్నారు? వాళ్లను ఎందుకు ప్రశ్నించలేదు? నన్నే ఎందుకు టార్గెట్ చేశారు? ఇవన్నీ పార్టీ ఆలోచించాలని సురేఖ ప్రశ్నించారు. తన కుమార్తె వ్యాఖ్యలను తాను సమర్థించడం లేదని, అదే సమయంలో ఖండించాల్సిన అవసరం తనకు లేదని స్పష్టం చేశారు. ''సుస్మిత ఒక ఇండిపెండెంట్ మహిళ. ఆమె ఏం మాట్లాడాలో నేను చెప్పలేను. ఆమె వ్యాఖ్యలను నేను సమర్థించడం లేదు. ఖండించడం కూడా లేదు. ఆమె వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయడం మాత్రం సరికాదు. నేను క్యాబినెట్‌లో ఉన్నందున నా రాజకీయ బాధ్యత వేరు. ఆమె పార్టీ సభ్యురాలు కూడా కాదు. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలకు నేను బాధ్యత వహించాల్సిన అవసరం లేదని అన్నారు.

**కాంగ్రెస్‌ను వీడే ఆలోచన లేదు..**

ఇప్పటి పరిణామాలతో నేను కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వెళ్లాలని అనుకోవడం లేదు. మాకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ అంటే ఎంతో గౌరవం. కాంగ్రెస్ పార్టీతో మా కుటుంబానికి అనుబంధం ఉంది. వాళ్లను చూసే మేము పార్టీలో ఉన్నాం. 2018లో కూడా కొంతమంది దుష్టశక్తులు మా కుటుంబానికి వ్యతిరేకంగా పనిచేశారు. అప్పుడు టికెట్లు రాకపోవడంతోనే మేము టీఆర్ఎస్‌లోకి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. అది వేరే ఉద్దేశంతో వెళ్లడం కాదు'' అని సురేఖ అన్నారు. ప్రస్తుతం తదుపరి కార్యాచరణపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదన్నారు. ''ఇప్పుడే కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడలేదు. నా భర్త కొండా మురళితో మాట్లాడాలి. జరిగిన పరిణామాలన్నింటినీ చర్చించుకోవాలి. ఆ తర్వాతే ఏ నిర్ణయం తీసుకోవాలో నిర్ణయిస్తాం. ఇప్పుడు నాకు పూర్తిగా ఆర్డర్లు కూడా అందలేదు. కాబట్టి తర్వాత ఏం జరుగుతుందో ఇప్పుడే చెప్పలేను. అన్ని విషయాలను డైజెస్ట్ చేసుకున్న తర్వాత ఒక నిర్ణయానికి వస్తాను. అప్పుడు ప్రెస్‌మీట్ పెట్టి నా అభిప్రాయాన్ని మీడియా ముందే స్పష్టంగా చెబుతానని సురేఖ తెలిపారు. తనపై తీసుకున్న చర్యపై పశ్చాత్తాపం లేదని ఆమె తేల్చిచెప్పారు. ''నేను ఏం తప్పు చేయలేదు. తప్పు చేసి ఉంటే, అందుకు నన్ను డిస్మిస్ చేసి ఉంటే ప్రజలు కూడా దాన్ని ఒప్పుకునే వారు. కానీ ఇప్పుడు జరిగినది కరెక్ట్ కాదు. అది వాళ్లకు కూడా తెలుసు.. నాకు కూడా తెలుసు. కాబట్టి నాకు పశ్చాత్తాపపడాల్సిన అవసరం లేదు. రాజకీయాల్లో కర్మఫలం అంటారు. నా విషయంలో ఏం జరిగిందో కాలమే చెబుతుంది. నేను మాత్రం చట్టబద్ధంగా, రాజకీయంగా నా తదుపరి నిర్ణయం తీసుకుంటాను'' అని కొండా సురేఖ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌లోనే ఉంటారా..?



మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించిన పరిణామాలతో కొండా దంపతుల రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. కాంగ్రెస్‌లోనే కొనసాగుతారా? లేక పార్టీ మారతారా? మారితే ఏ గూటికి చేరతారు? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరందుకుంది. కొండా సురేఖ తాజా వ్యాఖ్యలు ప్రస్తుతానికి కాంగ్రెస్‌ను వీడే ఆలోచన లేదనే సంకేతాలు ఇస్తున్నా.. మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన తీరు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తలెత్తిన రాజకీయ విభేదాలు, పార్టీ అధిష్ఠానంతో ఏర్పడిన దూరం నేపథ్యంలో కొండా దంపతుల తదుపరి అడుగు ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు కాంగ్రెస్‌లో కొనసాగేందుకు పరిస్థితులు అంత అనుకూలంగా కనిపించకపోగా.. మరోవైపు ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను ఎంచుకోవడంలోనూ అనేక ప్రశ్నలు ఎదురవుతున్నాయి. దీంతో కొండా దంపతులు ప్రస్తుతం రాజకీయ క్రాస్‌రోడ్‌లో ఉన్నారనే చర్చ జరుగుతోంది.

**కాషాయ గూటి నుంచి ఆహ్వానాలు**

కొండా సురేఖపై బర్తరఫ్ వేటు పడిన నేపథ్యంలో బీజేపీ నుంచి సానుకూల సంకేతాలు రావడం చర్చకు తావిస్తోంది. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఇప్పటికే కొండా దంపతులను బీజేపీలోకి ఆహ్వానించినట్లు సమాచారం. అదే సమయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వైపు నుంచి కూడా సానుకూల సంకేతాలు వచ్చినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్‌తో రాజకీయంగా దూరం పెరిగిన పరిస్థితుల్లో కొండా దంపతులకు బీజేపీ ఒక ప్రత్యామ్నాయంగా కనిపించే అవకాశం ఉందన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేకించి బీసీ రాజకీయాలను బలంగా ముందుకు తీసుకెళ్లాలని బీజేపీ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో.. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సీనియర్ బీసీ మహిళగా కొండా సురేఖకు ఉన్న రాజకీయ నేపథ్యం ఆ పార్టీకి ఉపయోగపడుతుందని బీజేపీ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొండా మురళి కూడా వరంగల్ ప్రాంత రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక వర్గాన్ని కలిగి ఉండటం.. ఇద్దరూ కలిసి కాషాయం గూటికి చేరితే ఉమ్మడి వరంగల్ రాజకీయాల్లో తమకు బలం చేకూరుతుందని బీజేపీ అంచనా వేస్తున్నట్లు సమాచారం.

**సిద్ధాంతం.. సమీకరణాలే అసలు ప్రశ్న**

అయితే బీజేపీలో చేరడం అంత సులువైన రాజకీయ సమీకరణం కాదన్న అభిప్రాయాలూ ఉన్నాయి. కొండా దంపతులు తమ రాజకీయ ప్రయాణంలో స్వతంత్ర భావజాలంతో వ్యవహరించిన నేతలుగా గుర్తింపు పొందారు. స్థానిక రాజకీయాల్లో తమ బలాన్ని, వ్యక్తిగత రాజకీయ నిర్ణయాలను ముందుకు తీసుకెళ్లడంలో కొండా దంపతులు ఎప్పుడూ వెనుకాడలేదన్న భావన ఉంది. అలాంటి రాజకీయ శైలికి బీజేపీ సైద్ధాంతిక విధానం, పార్టీ అధిష్ఠాన నిర్ణయాలు, సంస్థాగత క్రమశిక్షణ ఎంతవరకు సరిపోతాయన్నది కీలక ప్రశ్నగా మారింది. కాంగ్రెస్‌లోనే ముఖ్యమంత్రి, పార్టీ అధిష్ఠానం నిర్ణయాలపై తన అభిప్రాయాన్ని బహిరంగంగా వ్యక్తం చేసిన సురేఖ.. బీజేపీలో చేరితే ఆ పార్టీ విధానాలు, కేంద్ర నాయకత్వ నిర్ణయాలు, రాష్ట్ర పార్టీ సంస్థాగత వ్యవస్థకు అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుంది. వ్యక్తిగత రాజకీయ స్వేచ్ఛకు ప్రాధాన్యమిచ్చే కొండా దంపతులు ఆ వ్యవస్థలో ఎంతవరకు ఇమడగలరన్నదే ఇప్పుడు ప్రధాన చర్చ. బీజేపీ నుంచి ఆహ్వానాలు ఉన్నా.. చేరిక విషయంలో తుది నిర్ణయం తీసుకునే ముందు ఈ అంశాలన్నింటినీ కొండా దంపతులు బేరీజు వేసుకునే అవకాశం ఉంది.

**తెలంగాణలో జనసేన ఉనికి ఎంత..?!**

మరోవైపు కొండా దంపతులు జనసేన వైపు వెళ్లాలన్న సూచనలు కూడా శ్రేణుల్లోని ఓ వర్గం నుంచి వినిపిస్తున్నాయి. తెలంగాణలో జనసేనకు ఉన్న రాజకీయ విస్తరణ అవకాశాలను దృష్టిలో పెట్టుకుని ఆ పార్టీ ఒక ప్రత్యామ్నాయ వేదికగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ప్రస్తుతానికి కొండా దంపతుల నుంచి జనసేన వైపు వెళ్లే విషయంలో ఎలాంటి స్పష్టమైన సంకేతాలు లేవు. బీఆర్‌ఎస్ కూడా మరో ఆప్షన్‌గా కనిపించినా.. గతంలో ఆ పార్టీతో ఏర్పడిన విభేదాలు, అనంతరం చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో తిరిగి గులాబీ గూటికి చేరే అవకాశాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి వెళ్లిన కొండా దంపతులు తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చిన విషయం తెలిసిందే. దీంతో అదే రాజకీయ ప్రయాణాన్ని మరోసారి పునరావృతం చేస్తారా అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది.

**కాంగ్రెస్‌లో ఉంటారా?**

ఇన్ని రాజకీయ సమీకరణాల మధ్య కొండా సురేఖ మాత్రం ప్రస్తుతానికి కాంగ్రెస్‌ను వీడే ఆలోచన లేదని స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీపై తమకు గౌరవం ఉందని, కాంగ్రెస్ పార్టీతో తమ కుటుంబానికి అనుబంధం ఉందని ఆమె పేర్కొన్నారు. గతంలో కూడా పార్టీ అంతర్గత పరిణామాల కారణంగా తమకు టికెట్ రాకపోవడంతో బీఆర్‌ఎస్‌లోకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు. తాజా పరిణామాల తర్వాత కూడా వెంటనే పార్టీ మారే నిర్ణయం తీసుకోబోమన్నదే సురేఖ మాటల్లో స్పష్టమైంది. అయితే కాంగ్రెస్‌లో కొనసాగడం అంటే ప్రస్తుత నాయకత్వంతో ఏర్పడిన రాజకీయ విభేదాలను అధిగమించాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో బహిరంగంగా విభేదించిన తర్వాత మళ్లీ అదే పార్టీలో కొండా దంపతుల రాజకీయ ప్రయాణం ఎలా సాగుతుందన్నది ప్రశ్న. ముఖ్యంగా మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసిన పరిణామం తర్వాత వారి అనుచరులు, రాజకీయ వర్గాల్లో అసంతృప్తి ఉన్న నేపథ్యంలో పార్టీతో కలిసి పనిచేయడం ఎంతవరకు సాధ్యమన్నది కాలమే తేల్చాల్సి ఉంది.

**సంధికాలంలో సందిగ్ధమే**

ప్రస్తుతం కొండా దంపతుల ముందు స్పష్టమైన రాజకీయ ఆప్షన్ కంటే ప్రశ్నలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. కాంగ్రెస్‌లో కొనసాగితే ప్రస్తుత నాయకత్వంతో సయోధ్య ఎలా? బీజేపీలో చేరితే ఆ పార్టీ సిద్ధాంత, సంస్థాగత వ్యవస్థలో ఎంతవరకు ఇమడగలరు? జనసేన వైపు వెళ్తే తెలంగాణ రాజకీయాల్లో తమకు ఎంత మేర రాజకీయ స్థలం లభిస్తుంది? బీఆర్‌ఎస్‌లోకి తిరిగి వెళ్తే గత విభేదాలను ఎలా అధిగమిస్తారు? అనే ప్రశ్నలు వెంటాడుతున్నాయి. అందుకే కొండా దంపతులు ప్రస్తుతం రాజకీయంగా ఒక సంధికాలంలో ఉన్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సురేఖ మాటల్లో కాంగ్రెస్‌పై అభిమానం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ.. బర్తరఫ్ పరిణామంపై ఆమె వ్యక్తం చేస్తున్న అసంతృప్తి కూడా అంతే తీవ్రంగా ఉంది. పార్టీ వీడే ఆలోచన లేదని చెబుతున్నా.. భవిష్యత్తు రాజకీయ కార్యాచరణపై మాత్రం తక్షణ నిర్ణయం ప్రకటించలేదు. కుటుంబ సభ్యులతో, ముఖ్యంగా భర్త కొండా మురళితో చర్చించిన తర్వాతే తదుపరి అడుగుపై నిర్ణయం తీసుకుంటానని ఆమె ఇప్పటికే స్పష్టం చేశారు. అందువల్ల ఇప్పటికైతే కాంగ్రెస్‌లోనే.. కానీ భవిష్యత్తు మాత్రం నిర్ణయం తీసుకోవాల్సిన దశలోనే అన్న పరిస్థితి కొండా దంపతుల రాజకీయ ప్రయాణంలో కనిపిస్తోంది. బీజేపీ నుంచి ఆహ్వానాలు, ఇతర పార్టీలపై జరుగుతున్న చర్చలు.. కాంగ్రెస్‌లో కొనసాగేందుకు ఉన్న రాజకీయ ఇబ్బందులు. ఇవన్నీ కలిపి చూస్తే కొండా దంపతుల తదుపరి అడుగు తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామానికి దారితీసే అవకాశం ఉంది.

ఉత్తరం కాకతీయ ఎడిటర్
- కిరణ్ గౌడ్ అరెల్లి
-7396604266

# అసెంబ్లీ సమావేశాలకు సన్నద్ధం కండి

- సభ్యుల ప్రశ్నలకు తక్షణ సమాధానాలు సిద్ధం చేయాలి
- ప్రతి శాఖలో నోడల్ అధికారిని నియమించాలి
- పెండింగ్ ప్రశ్నలకు సమాచారాన్ని వెంటనే అందించాలి
- సీఎస్ సంజయ్ జాజు ఆదేశం

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు అన్ని శాఖలు ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. శాసనసభ్యులు అడిగే ప్రశ్నలకు నిర్ణీత సమయంలో సమగ్ర సమాధానాలు అందించేందుకు అవసరమైన సమాచారాన్ని ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అసెంబ్లీ సమావేశాల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాసనసభ్యులు ప్రస్తావించే అంశాలపై సంబంధిత శాఖలు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి శాఖ తరఫున అసెంబ్లీ సమావేశాల కోసం ఒక నోడల్ అధికారిని నియమించుకోవాలని ఆదేశించారు.

**ప్రశ్నలకు సమాధానాలపై నిరంతర పర్యవేక్షణ**

నోడల్ అధికారులు ప్రశ్నలకు సమాధానాల తయారీ, అవసరమైన సమాచార సేకరణ, వివిధ శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సంజయ్ జాజు సూచించారు. శాసనసభలో ఏదైనా ప్రశ్నకు సంబంధించి అదనపు సమాచారం అవసరమైన సందర్భంలో సంబంధిత శాఖల నుంచి వెంటనే వివరాలు సేకరించి, నిర్ణీత సమయంలో సమాధానం అందించేలా సమన్వయ వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు, విభాగాధిపతులు అవసరమైన సమాచారంతో ముందస్తుగా సిద్ధంగా ఉండాలని సీఎస్ సూచించారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ప్రశ్నోత్తరాలకు సంబంధించిన సమాచారాన్ని వెంటనే అసెంబ్లీ అధికారులకు అందజేయాలని ఆదేశించారు. సమావేశాల సందర్భంగా ఎలాంటి జాప్యం లేకుండా ప్రశ్నలకు సమాధానాలు అందించేలా శాఖల మధ్య సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్‌రాజ్, నవీన్ మిట్టల్, బీఎండీ ఎక్కా, వాణి ప్రసాద్, ముఖ్య కార్యదర్శులు సందీప్‌కుమార్ సుల్తానియా, యోగితా రాణా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనకు వెయ్యి రోజులు.. సంబరాలు

**సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట : టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్**



**కాకతీయ, శంకరపట్నం :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా శంకరపట్నం మండల కేంద్రంలో గురువారం పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. మండల అధ్యక్షుడు బండారి తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి టీపీసీసీ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తూ పేద, మధ్యతరగతి వర్గాలకు అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచుకుని సంబరాలు నిర్వహించారు.

# విజృంభిస్తున్న విష జ్వరాలు

- పేషెంట్లతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ దవాఖాన
- రికార్డుల్లో నలుగురు వైద్యులు.. డ్యూటీలో ఒక్కరే
- 30 పడకల ఆస్పత్రిలో ప్రస్తుతం వినియోగంలో 15 పడకలే

**కాకతీయ, గంభీరావుపేట :** విష జ్వరాలు విజృంభిస్తున్న వేళ గంభీరావుపేట మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) పేషెంట్లతో కిటకిటలాడుతోంది. ఆస్పత్రి రికార్డుల ప్రకారం నలుగురు వైద్యులు ఉన్నప్పటికీ గురువారం ఉదయం డ్యూటీలో ఒక్కరే వైద్యాధికారి ఉండటంతో రోగులకు వైద్యం అందించడం ఇబ్బందికరంగా మారింది. పేషెంట్లు భారీ సంఖ్యలో వరుస కట్టడంతో వైద్యం కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం 9.30 గంటల నుంచి నిమిషానికి ఒకరి చొప్పున పేషెంట్లు వచ్చినట్లుగా రికార్డులు చూపుతున్నాయి. ఈ సమయంలో ఒక్కరే వైద్యాధికారి ఉండటంతో వచ్చిన రోగులందరికీ సకాలంలో వైద్యం అందించడం భారంగా మారింది. ఉదయం 11.30 గంటల తర్వాత ఆస్పత్రి సూపరింటెండెంట్ డ్యూటీలో చేరి మధ్యాహ్నం 3 గంటల వరకు విధులు నిర్వర్తించారు. ఉన్న నలుగురు వైద్యుల్లో ఒకేరోజు ఇద్దరు వైద్యులు విధుల్లో ఉంటే రోగులకు త్వరగా వైద్య సేవలు అందే అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**రక్త పరీక్షలకు భారీగా నమూనాలు**

ప్రస్తుతం వైరల్ ఫీవర్ కేసులు అధికంగా వస్తుండటంతో రక్త పరీక్షల కోసం కూడా రోగులు బారులు తీరుతున్నారు. పది మంది పేషెంట్లలో కనీసం ఆరుగురి నుంచి రక్త పరీక్షల నమూనాలు సేకరించాల్సి వస్తోందని వైద్య సిబ్బంది చెబుతున్నారు. దీంతో ల్యాబొరేటరీ వద్ద కూడా రోగులు క్యూలో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గంభీరావుపేట సీహెచ్‌సీలో మొత్తం 30 పడకలతో వైద్య సేవలు అందించాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం 15 పడకలను మాత్రమే వినియోగిస్తున్నారు. పూర్తిస్థాయిలో పడకలను ఉపయోగించుకునేందుకు స్థలం సరిపోవడం లేదని స్థానిక వైద్యాధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఇన్‌పేషెంట్లతో అందుబాటులో ఉన్న పడకలన్నీ నిండిపోయాయి. విష జ్వరాల తీవ్రత నేపథ్యంలో మరింత మంది రోగులు ఆస్పత్రిలో చేరాల్సి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

**24 గంటల వైద్య సేవలకు కృషి**

సూపరింటెండెంట్ డాక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ.. ఐదుగురు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒక పోస్టు బ్లాక్ అయిందన్నారు. ప్రస్తుతం ఉన్న నలుగురు వైద్యులతో 24 గంటల పాటు వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇన్‌పేషెంట్ల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని అతికష్టంపై మరో ఐదు పడకలను సర్దుబాటు చేసే అవకాశం ఉందన్నారు. మరికొన్ని పడకలకు మరమ్మతులు చేయించాల్సి ఉన్నప్పటికీ వాటిని వినియోగించేందుకు స్థలం సరిపోవడం లేదని చెప్పారు. విష జ్వరాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని రోగులకు ఇబ్బందులు కలగకుండా వైద్య సేవల పరిధిని పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని, వీలైనంత మేరకు ఇద్దరు వైద్యులను విధుల్లో ఉంచేలా చర్యలు తీసుకుంటామని డాక్టర్ ధనరాజ్ తెలిపారు.

# వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఒరిగిందేమిటి?

- హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- ఆటో కార్మికులకు రూ.12 వేల సాయం ఏమైంది?
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



**కాకతీయ, శంకరపట్నం :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ విమర్శించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్ ఆధ్వర్యంలో శంకరపట్నం మండల కేంద్రంలో నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్‌ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

**ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ ఏమైంది?**

ఆటో రిక్షా కార్మికుడు గౌడిశాల సదానందం మాట్లాడుతూ ఆటో కార్మికులకు నెలకు రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య తగ్గి ఆదాయం పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ

(మొదటిపేజీ తరువాయి)

కొబ్బరికాయ కొట్టి చేతులు దులుపుకుందని, బ్రిడ్జి నిర్మాణానికి ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయించి ఫ్లైఓవర్‌ను పూర్తి చేసిందన్నారు. గతంలోనే తాను చెప్పానని.. ఇది ఓల్డ్ సిటీ కాదని, ఒరిజినల్ సిటీ అని అన్నారు. ఇక్కడి ప్రతి గల్లీ తనకు తెలుసని పేర్కొన్నారు. ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అడిగిన ప్రతి అభివృద్ధి పనిని మంజూరు చేయాలని ఈ వేదికగా అధికారులను ఆదేశించారు. బలాల కళాశాల అభివృద్ధికి ఎమ్మెల్యే రూ.20 కోట్లు అడిగారని, తాను రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నానని సీఎం ప్రకటించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, అయితే ఏడాదిన్నరలో అభివృద్ధి పనులను పూర్తి చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేదేనని స్పష్టం చేశారు. విద్య కోసం ఎంత ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

**అసదుద్దీన్ దేశభక్తిని చాటుకున్నారు**

ఆపరేషన్ సింధూర్ సమయంలో అసదుద్దీన్ ఓవైసీ హిందుస్థాన్‌కు మద్దతుగా నిలిచి దేశభక్తిని చాటుకున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. రాజకీయ సిద్ధాంతాలు వేరుగా ఉండొచ్చని, దేశభక్తి విషయంలో మాత్రం అందరం ఒక్కటేనని పేర్కొన్నారు. అభివృద్ధి విషయంలోనూ రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రస్తుతం కేబుల్ బ్రిడ్జి చూడాలంటే దుర్గం చెరువుకు వెళ్లాల్సి వస్తోందని, అందుకే మీరాలం చెరువులో మూడు కిలోమీటర్ల మేర కేబుల్ బ్రిడ్జి నిర్మించబోతున్నామని తెలిపారు. నగరంలోని పేదలకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

**చాంద్రాయణగుట్ట వరకు మెట్రో**

వచ్చే ఎన్నికల్లోగా గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రోను పూర్తి చేస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మెట్రోలో వచ్చి ప్రజలను ఓట్లు అడుగుతామని అన్నారు. అలాగే నాగోల్ నుంచి ఎల్బీనగర్, చంద్రాయణగుట్ట, రాజేంద్రనగర్, శంషాబాద్ వరకు మెట్రోను విస్తరించబోతున్నామని చెప్పారు. నగరంలోని అన్ని ప్రాంతాలను మెట్రోతో అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించబోతున్నామని సీఎం ప్రకటించారు. ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని తెలిపారు. పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

### మూసీ అభివృద్ధితో నైట్ ఎకానమీ

మూసీ రివర్‌ఫ్రంట్‌ను అభివృద్ధి చేసి నైట్ ఎకానమీని ప్రోత్సహిస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు. అయితే మూసీ అభివృద్ధిని బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. మూసీ అభివృద్ధితో నగరంలో ఉపాధి అవకాశాలు పెంచుతామని, ముఖ్యంగా ఇక్కడి పేద ముస్లింలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని సీఎం పేర్కొన్నారు. హిందూ, ముస్లిం కలిసి నడిస్తేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. నగరాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని తాము ప్రయత్నిస్తుంటే బీజేపీ, బీఆర్‌ఎస్ అడుగడుగునా అడ్డుకుంటున్నాయని విమర్శించారు. “ఎన్నికలప్పుడే రాజకీయాలు.. ఎన్నికలు ముగిసాక అభివృద్ధి ఒక్కటే లక్ష్యం. మనందరం కలిసికట్టుగా ఈ నగరాన్ని అభివృద్ధి చేసుకుందాం” అని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# నేను రేవంత్‌రెడ్డిని శపిస్తున్నా

- మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు
- నా తల్లికి అన్యాయం జరిగింది..
- ఆమెను తొలగించిన తీరు తీవ్రంగా బాధించింది
- దమ్ముంటే పరకాల నుంచి రేవంత్‌రెడ్డి పోటీ చేయాలి
- నేను సవాల్ విసురుతున్నా
- మంత్రి వర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్‌పై సుస్మిత ఆగ్రహం

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు. నేను రేవంత్‌రెడ్డిని శపిస్తున్నా అని కొండా సురేఖ కుమార్తె సుస్మిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లికి అన్యాయం జరిగిందని, ఆమె పట్ల వ్యవహరించిన తీరు తనను తీవ్రంగా బాధించిందని పేర్కొన్నారు. తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన నేపథ్యంలో సుస్మిత స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన తల్లికి అన్యాయం జరిగిందని సుస్మిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెను మంత్రి పదవి నుంచి తొలగించిన తీరు తనను తీవ్రంగా బాధించిందన్నారు. తన తల్లి గొంతును ఎవరూ నొక్కలేరని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై రేవంత్‌రెడ్డిని శపిస్తున్నట్లు సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల నియోజకవర్గం నుంచి రేవంత్‌రెడ్డి పోటీ చేయాలని సుస్మిత సవాల్ విసిరారు. తన తల్లి విషయంలో జరిగిన పరిణామాలపై తాను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నట్లుగా ఆమె వ్యాఖ్యలు చేశారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత హోదాలో ఒక వ్యక్తిని ఉద్దేశించి చేసినవేనని సుస్మిత స్పష్టం చేశారు. వాటికి ఏ పార్టీతోనూ సంబంధం లేదని పేర్కొన్నారు. తన వ్యాఖ్యలను రాజకీయంగా ముడిపెట్టడం సరికాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# సింగరేణి కార్మికులకు ప్రభుత్వం మొండిచేయి

- ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- 6 గ్యారంటీలు, 420 హామీలపై ప్రజల్లో చైతన్యం
- అనారోగ్య కార్మికుల మెడికల్ ఇన్వాలిడేషన్‌పై నిర్లక్ష్యం
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ధ్వజం

**కాకతీయ, భూపాలపల్లి :** ఎన్నికలకు ముందు సింగరేణి కార్మికులకు అనేక హామీలు ఇచ్చి అరచేతిలో స్వర్గం చూపించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొండిచేయి చూపుతోందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. గురువారం భూపాలపల్లి సింగరేణి ఏరియా 1 ఇంక్లైన్ వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు సింగరేణి కార్మికులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన 6 గ్యారంటీలు, ఇతర హామీలను అమలు చేయడంలో విఫలమైందని గండ్ర ఆరోపించారు. విధుల్లో ఉండి అనారోగ్యానికి గురైన కార్మికులకు మెడికల్ ఇన్వాలిడేషన్ కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. మెడికల్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో పాటు, బోర్డుల ద్వారా పలువురు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను తిరస్కరిస్తున్నారని విమర్శించారు. సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ భూపాలపల్లి ప్రాంతంలో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 6 గ్యారంటీలు, 420 హామీల అమలుపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. హామీలను అమలు చేయకుండా ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను మున్సిపల్ అధికారులు తొలగించడాన్ని గండ్ర తప్పుబట్టారు. అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీలపై చర్యలు తీసుకోకుండా బీఆర్‌ఎస్ వాటినే తొలగించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమన్నారు. ఫ్లెక్సీలు తొలగించినంత మాత్రాన ప్రజల్లోని ప్రభుత్వ వ్యతిరేక అభిప్రాయాన్ని తొలగించలేరని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.


# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

- రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను వేగవంతం చేయాలి
- పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి
- లైసెన్స్‌డ్ సర్వేయర్లు విధులకు హాజరుకాకపోతే చర్యలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు ప్రతి భూయజమానికి చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భూ రీసర్వేను రాష్ట్ర వ్యాప్తంగా వేగవంతం చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ నిర్ణీత సమయంలో ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందించాలని స్పష్టం చేశారు. గురువారం భద్రాద్రి ఐడీవోసీ కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో రెవెన్యూ, భూ రీసర్వే, రిజిస్ట్రేషన్, గృహ నిర్మాణ అంశాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్, రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి (రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు) రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి పలు అంశాలపై సమీక్షించారు.

**భూ భారతి చట్టం పకడ్బందీగా అమలు**

ధరణి స్థానంలో ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ద్వారా భూములు ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పొంగులేటి తెలిపారు. తహసీల్దార్లు, ఆర్డీవోలు, రెవెన్యూ సిబ్బంది ప్రజల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తును పరిశీలించి అవసరమైన సర్వే నిర్వహించి అర్హులకు న్యాయం చేయాలన్నారు. కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి భూ సర్వేను పూర్తి చేయాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో నాన్‌కెడస్ట్రల్, కెడస్ట్రల్ గ్రామాల్లో సర్వే పురోగతి, 22ఏ భూములు, సాదా బైనామాలు, పెండింగ్ దరఖాస్తులు, అటవీరెవెన్యూ భూముల సరిహద్దు వివాదాలను సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. గత కొన్ని నెలలుగా కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు.



### గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి

**లోక్‌భవన్‌లో మర్యాదపూర్వక భేటీ.. పలు అంశాలపై చర్చ**

లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. ఇటీవల గవర్నర్ అనారోగ్యానికి గురైన నేపథ్యంలో సీఎం పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.
-కాకతీయ, హైదరాబాద్

# సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం దారుణం

- బీసీ మహిళా నేతపై రాజకీయ కక్ష సాధింపు తగదు
- కుటుంబ సభ్యుల రాజకీయ అభిప్రాయాలకు మంత్రిని బాధ్యురాలిని చేస్తారా..?!
- ఒకే కుటుంబంలో భిన్న రాజకీయ భావాలు ఉండకూడదా..?!
- కాంగ్రెస్ జిల్లా నాయకులు రడం భరత్‌కుమార్ డిమాండ్



**కాకతీయ, గీసుగొండ:** తెలంగాణ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా ప్రజల కోసం పోరాడుతూ, బీసీ వర్గాల గొంతుకగా నిలిచిన కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం దారుణమని జిల్లా నాయకులు రడం భరత్‌కుమార్ అన్నారు. గీసుగొండ మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో మాట్లాడారు. కుటుంబ సభ్యురాలు చేసిన వ్యక్తిగత రాజకీయ వ్యాఖ్యలకు మంత్రిని బాధ్యురాలిని చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తన వ్యక్తిగత అభిప్రాయాలని, వాటితో తన తల్లికి సంబంధం లేదని ఆమె స్వయంగా స్పష్టం చేసిన విషయాన్ని రడం భరత్‌కుమార్ గుర్తుచేశారు. కుటుంబ బంధం ఉన్నంత మాత్రాన ఒకరి వ్యాఖ్యలకు మరొకరిని రాజకీయంగా బాధ్యురాలిని చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ఒకే కుటుంబంలోని వ్యక్తులు భిన్న రాజకీయ పార్టీలను, అభిప్రాయాలను అనుసరించడం వారి వ్యక్తిగత స్వేచ్ఛలో భాగమేనని తెలిపారు. అభ్యంతరకర వ్యాఖ్యలు ఉంటే వాటిపై మాట్లాడిన వ్యక్తినే ప్రశ్నించాలి తప్ప, సంబంధం లేని తల్లిని మంత్రి పదవి నుంచి తొలగించడం ఏ న్యాయమని ప్రశ్నించారు. బీసీ మహిళా నేతగా కొండా సురేఖను కుటుంబ సభ్యురాలి వ్యాఖ్యలను కారణంగా చూపి పదవి నుంచి తప్పించడం బీసీ మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసే చర్యగా అభివర్ణించారు. కొండా సురేఖపై చర్యకు కారణమైన ఆమె తప్పేమిటో స్పష్టంగా వెల్లడించాలని, కుమార్తె వ్యాఖ్యల ఆధారంగా మంత్రి పదవి నుంచి తొలగించడం సరికాదని డిమాండ్ చేశారు. నిర్ణయాన్ని పునఃపరిశీలించి ఆమెను తిరిగి మంత్రి పదవిలో కొనసాగించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచులు పేర్ల శ్రావణ్, కొమ్ముల కమల బిక్షపతి, బానోతు రాఘవేంద్ర, నాయకులు దర్శనాల రాజు, తాళ్లపల్లి అనిల్, కార్తీక్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పాలన చేతకాకపోతే గద్దె దిగిపోండి..

- పంటలు ఎండిపోతున్నా సర్కార్‌కు పట్టింపులేదు
- ఎస్సారెస్పీ కాల్వకు నీరు విడుదల చేయాలి
- కేసీఆర్‌కు పేరు వస్తుందనే నీటి విడుదల ఆపుతున్నారు
- కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగిస్తాం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్



**కాకతీయ, పెద్దవంగర :** ఎస్సారెస్పీ కాల్వకు వెంటనే నీటిని విడుదల చేసి ఎండిపోతున్న వరి పంటలను కాపాడాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి లేకపోతే గద్దె దిగిపోవాలని మండిపడ్డారు. గురువారం పెద్దవంగర మండల కేంద్రంలోని సబ్ కెనాల్ నుంచి కిష్టు తండా వరకు రైతులతో కలిసి ఎండిపోయిన ఎస్సారెస్పీ పేజ్ 2 కాల్వ వెంట పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాల్వల ద్వారా చెరువులకు సాగునీరు అందించి కళ్లముందే ఎండిపోతున్న వరి పంటలను కాపాడాలని కోరారు. వర్షాకాలంలో కాల్వకు నీరు వస్తుందన్న ఆశతో రైతులు వరి నాట్లు వేశారని, ఇప్పుడు నీరు అందకపోతే ఎకరాకు రూ.25 వేల వరకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉందన్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా నీరు విడుదల చేయొద్దని ప్రభుత్వం చెబుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**యూరియా, కరెంట్ కష్టాలతో రైతులు ఆగం**

యూరియా దొరకక, కరెంట్ సమస్యలతో రైతులు ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నారని, పంట రుణమాఫీ సక్రమంగా జరగకపోగా రైతుబీమా విషయంలోనూ ప్రభుత్వం మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పంటలకు నీరు ఇస్తే పంటలు పండుతాయని, అలా జరిగితే కేసీఆర్‌కు పేరు వస్తుందనే ఉద్దేశంతోనే నీటిని విడుదల చేయకుండా రైతుల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రైతుల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని, సాగునీరు అందించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగిస్తూ తులం బంగారం ఇవ్వాలని, లేదంటే మహిళలే ప్రభుత్వాన్ని నిలదీస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, ఆయా గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలి

- తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి
- చరవాణిని చదువుకు మాత్రమే వినియోగించాలి
- వసతిగృహంలో ఆరోగ్య సమస్యలపై తక్షణమే స్పందించాలి : మంత్రి సీతక్క

**కాకతీయ, ఏటూరునాగారం రూరల్ :** విద్యార్థినులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని, తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. గురువారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలను ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి, ప్రార్థనలో పాల్గొని వారితో కలిసి అల్పాహారం చేశారు. వసతిగృహ జీవితం ఐక్యత, పరస్పర సహకారం, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందన్నారు. తోటి విద్యార్థినులకు అనారోగ్యం లేదా మానసిక ఇబ్బందులు ఎదురైతే అండగా నిలవాలని సూచించారు. చరవాణిని చదువుకు, సాధారణ పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి మాత్రమే వినియోగించాలని, పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. విద్యార్థి దశలో ఎదురయ్యే ఆకర్షణలకు లోనుకాకుండా లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం హెచ్‌ఎంటీసీ స్థలంలో ఐదు ఎకరాల్లో నిర్మించనున్న నూతన ఐటీడీఏ భవన స్థలాన్ని పరిశీలించి, పనులను త్వరగా ప్రారంభించాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, అధికారులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



# హరిత సాంకేతికతలతోనే ఎంఎస్ఎంఈలకు లాభాలు

- ములుగు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్

**కాకతీయ, ములుగు ప్రతినిధి :** చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు హరిత సాంకేతికతలను విస్తృతంగా స్వీకరించడం ద్వారా ఉత్పత్తి వ్యయాలను తగ్గించడంతోపాటు మార్కెట్లో పోటీతత్వాన్ని పెంచుకోవచ్చని ఆర్ఐసీహెచ్ ప్రాజెక్ట్ మేనేజర్-సస్టైనబిలిటీ గురు చరణ్ ఉప్పరపల్లి అన్నారు. ములుగు రైస్ మిల్ అసోసియేషన్ సహకారంతో ఆర్ఐసీహెచ్ ఆధ్వర్యంలో మంగళవారం ములుగులో ఆర్ఏఎంపీ-గ్రీటింగ్స్ ఆఫ్ ఎంఎస్ఎంఈ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ పరిశ్రమల్లో ఇంధన వినియోగం ప్రధాన వ్యయ అంశమని, ఆధునిక ఇంధన సామర్థ్య సాంకేతికతలతో విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. సౌర విద్యుత్ వినియోగం, నీటి పొదుపు, ముడి పదార్థాల సమర్థ వినియోగం, వ్యర్థాల నిర్వహణపై దృష్టి పెట్టాలని సూచించారు. హరిత సాంకేతికతలు పర్యావరణ పరిరక్షణతోపాటు వ్యాపార స్థిరత్వం, ఉత్పత్తి వ్యయాల నియంత్రణకు దోహదపడతాయని పేర్కొన్నారు. ములుగు రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రైస్ మిల్లులు సౌర విద్యుత్, ఇంధన సామర్థ్య సాంకేతికతలను స్వీకరించి విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవాలని సూచించారు. యంత్రాల సామర్థ్యం, వనరుల సమర్థ వినియోగం పెంచడం ద్వారా దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజనాలు పొందవచ్చన్నారు.

# మత్తును వదిలి.. జీవితాన్ని ఎంచుకోండి

- వ్యసనాన్ని దాచకుండా చికిత్సకు ముందుకు రావాలి
- వ్యసన విముక్తికి పోలీసుల చొరవ : వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత
- ఎంజీఎం ఏటీఎఫ్ కేంద్రంలో వైద్యం, కౌన్సెలింగ్



**కాకతీయ, వరంగల్ బ్యూరో :** మత్తు పదార్థాలకు బానిసైన వారు వ్యసనాన్ని దాచకుండా చికిత్స, కౌన్సెలింగ్ కోసం ముందుకు రావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటూనే వ్యసనానికి గురైన వారిని శిక్షించడం మాత్రమే కాకుండా చికిత్స అందించి సాధారణ జీవితంలోకి తీసుకురావడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈగల్ ఫోర్స్ సహకారంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో ఆధునికీకరించిన అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ (ఏటీఎఫ్) కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి పడకల సామర్థ్యాన్ని 10 నుంచి 20కి పెంచారు. సీసీటీవీ నిఘా, భద్రతా ఏర్పాట్లతోపాటు క్యారమ్, చెస్ వంటి సౌకర్యాలు కల్పించారు. అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో వైద్యం, కౌన్సెలింగ్, డీఅడిక్షన్ సేవలు అందించనున్నారు. పిల్లలు లేదా కుటుంబ సభ్యులు మత్తు పదార్థాలకు బానిసైనట్లు గుర్తిస్తే సమస్యను దాచకుండా వెంటనే చికిత్స అందించాలని పోలీసులు సూచించారు. సహాయం కోసం 87125 84473, 87126 85299 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఎంజీఎం సూపరింటెండెంట్ డా. రాంరెడ్డి, పోలీసు, ఎంజీఎం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రేమ పేరుతో మోసం.. గర్భిణీ యువతి బలవన్మరణం

- పెళ్లి చేసుకుంటానని నమ్మించిన యువకుడు
- గర్భం దాల్చిన తర్వాత నిరాకరణ
- పెద్దల సమక్షంలో పంచాయతీ జరిగినా కొలిక్కిరాని సమస్య
- నాలుగేళ్ల ప్రేమ బంధం విషాదాంతం
- సీరోల్ ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో దర్యాప్తు

**కాకతీయ, మహబూబాబాద్ :** ప్రేమ పేరుతో మోసపోయిన ఓ గర్భిణీ యువతి బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నల్లెల్ల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బండి మౌనిక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మౌనికకు అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్‌తో నాలుగేళ్లుగా ప్రేమ సంబంధం ఉన్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన శ్రీకాంత్.. మౌనిక గర్భం దాల్చిన అనంతరం పెళ్లికి నిరాకరించినట్లు తెలిపారు. ఈ విషయంపై పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. పెళ్లికి అంగీకారం లభించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మౌనిక బలవన్మరణానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీకాంత్‌ను అరెస్ట్ చేసినట్లు సీరోల్ ఎస్ఐ సంతోష్ తెలిపారు. ఫిర్యాదులో ప్రస్తావించిన ఇతరుల పాత్రపైనా లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, విచారణలో లభించే ఆధారాల మేరకు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.



# స్వయం ఉపాధితో ఎదగాలి..

- స్థానిక వనరులతో ఆదాయం పెంచుకోవాలి
- మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి
- అటవీ ఉత్పత్తులతో గ్రామాల్లోనే ఉపాధి పొందాలి
- మహిళా సంఘాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి సీతక్క

**కాకతీయ, ఏటూరునాగారం రూరల్ :** మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకొని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. స్థానిక వనరులను సద్వినియోగం చేసుకొని గ్రామాల్లోనే ఆదాయ మార్గాలను పెంచుకోవాలని సూచించారు. గురువారం ఏటూరునాగారం మండల కేంద్రంలో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి దుస్తులు, జూట్ బ్యాగుల తయారీ యూనిట్లను ప్రారంభించారు. మహిళా సంఘాలకు బ్యాంకుల అనుసంధానంతో వడ్డీలేని రుణాలు అందిస్తూ ప్రభుత్వం స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తోందన్నారు. ములుగు నియోజకవర్గంలో ప్రైవేటు సంస్థల సహకారంతో సుమారు 2,000 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా 1,000 కుట్టు యంత్రాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.



పాఠశాలలు, వసతిగృహాలు, అంగన్‌వాడీల ఏకరూప దుస్తుల కుట్టు పనులను స్థానిక మహిళలకు అందిస్తామన్నారు. ఇప్పపువ్వు, తేనె, విస్తరాకుల ఆకులతో ఉత్పత్తులు తయారు చేసి ఆదాయం పొందాలని సూచించారు. అనంతరం 10 మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, 1,219 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. 11 ఉత్తమ పాఠశాలలకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఐఈడీ పేలుడులో వ్యక్తి మృతి

- వెదురు బొంగుల కోసం అడవికి వెళ్లిన ఆరుగురు
- కర్రెగుట్టల్లో పామునూరు పోలీస్ క్యాంపు సమీపంలో ఘటన
- ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు





**కాకతీయ, ఏటూరునాగారం:** ములుగు జిల్లా నూగూరు వెంకటాపురం మండలం ఏదుల్లా చెరువు కాలనీలో విషాదం చోటుచేసుకుంది. వెదురు బొంగుల కోసం అడవికి వెళ్లిన మడకం నాగేశ్వరరావు (55) ఐఈడీ పేలుడులో మృతి చెందారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. నాగేశ్వరరావుతో పాటు మరో ఐదుగురు బుధవారం అడవికి వెళ్లారు. సాయంత్రం 4 గంటల సమయంలో పామునూరు పోలీస్ క్యాంపునకు సమీపంలోని కర్రెగుట్టల ప్రాంతంలో ఐఈడీ పేలింది. ఈ ఘటనలో నాగేశ్వరరావు మృతి చెందడంతో ఏదుల్లా చెరువు కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై సీఐ ముత్యం రమేష్, ఎస్ఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఐఈడీ అక్కడ ఎలా అమర్చబడింది, పేలుడుకు దారితీసిన పరిస్థితులపై వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# బీఆర్ఎస్ నేతలు బహిరంగ చర్చకు సిద్ధమా?

- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై సవాల్
- మండల అధ్యక్షుడు రంగు మురళి గౌడ్



**కాకతీయ,పెద్దవంగర :** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నాయకులు బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రంగు మురళి గౌడ్, సీనియర్ నాయకులు నెహ్రూ నాయక్, సంకెపల్లి రవీందర్‌రెడ్డి సవాల్ విసిరారు. గురువారం ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన పూర్తయిన సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా పరిధిలో కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో కుటుంబ, గడీల పాలన సాగిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజాపాలన కొనసాగుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. గత పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గీసుగొండలో భారీ బందోబస్తు


- కొండా సురేఖ బర్తరఫ్ నేపథ్యంలో ముందస్తు చర్యలు
- ప్రధాన కూడళ్లు, సున్నిత ప్రాంతాల్లో నిఘా
- సీఐ విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసుల కవాతు



**కాకతీయ, గీసుగొండ :** కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేసిన నేపథ్యంలో గీసుగొండ మండలంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మండల కేంద్రంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. సీఐ విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, రహదారులు, సున్నిత ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఉద్రిక్తతలకు తావులేకుండా ప్రజలు సంయమనం పాటించాలని పోలీసులు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని తెలిపారు.

# ఎన్ఆర్ఐలకు వీసా నిబంధనల్లో సడలింపులు ఇవ్వాలి

- అమెరికా కాంగ్రెస్ ప్రతినిధులకు వినతి
- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు
- పర్యాటక వీసాల ఇబ్బందులపై ప్రస్తావన



**కాకతీయ, వరంగల్ బ్యూరో :** అమెరికాలో నివసిస్తున్న తెలంగాణ ఎన్ఆర్ఐలకు వీసా నిబంధనల్లో సడలింపులు కల్పించాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అమెరికా కాంగ్రెస్ ప్రతినిధులను కోరారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన వర్జీనియా 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ ప్రతినిధి సుహాస్ సుబ్రమణ్యం, 11వ డిస్ట్రిక్ట్ ప్రతినిధి జేమ్స్ వాకిన్ షాలను కలిశారు. తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఏర్పాటు తదితర అంశాలను వారికి వివరించారు. అమెరికాలో 12 లక్షల మందికిపైగా తెలుగు ప్రజలు ఉండగా, వారిలో సుమారు 6 లక్షల మంది తెలంగాణకు చెందినవారని తెలిపారు. పర్యాటక వీసాల విషయంలో తెలంగాణ కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. అన్ని రకాల వీసా నిబంధనల్లో సడలింపులతోపాటు లక్ష డాలర్ల ఫీజు నిబంధనను తగ్గించే అంశాన్ని అమెరికా పార్లమెంటులో ప్రస్తావించాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ ప్రతినిధులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

**కాకతీయ, ఇనుగుర్తి :** ప్రభుత్వం నిర్దేశించిన వరి ఏడు రకాల సన్న వంగడాలను సాగు చేసిన రైతులు పంట వివరాలను ఈ నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.కె. యాస్మిన్ సూచించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు సంబంధిత డీలర్ ద్వారా పోర్టల్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. సొంత విత్తనాలు లేదా ఇతర రైతుల నుంచి పొందిన విత్తనాలను వినియోగించిన వారు రైతు ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించి క్లస్టర్ ఏఈఓల ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. మండలంలో 4,560 మంది రైతులకు గాను ఇప్పటివరకు 750 మంది మాత్రమే వివరాలు నమోదు చేసుకున్నారని చెప్పారు. నమోదు చేసుకున్న రైతులకే పంట కొనుగోళ్లలో క్వింటాల్‌కు రూ.500 బోనస్ వర్తిస్తుందని తెలిపారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266